
ఆంధ్రజ్యోతి
***

ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 22 అక్టోబరు 2024

ఏపీకి వెళ్లాలంటే రూ.5వేలా?

- సింగిల్ పర్మిట్ విధానంపై నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10 వేల మంది లారీఓనర్స్
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10 వేల మంది లారీఓనర్స్



తెలుగు రాష్ట్రాల మధ్య సింగిల్ పర్మిట్ విధానం అమలు కోసం లారీ యజమానులు కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నారు. పక్కనున్న ఏపీకి వెళ్లిన ప్రతీసారి రూ.5వేలు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేదంటే ఏడాదికి రూ.60 వేలు చెల్లించాల్సి వస్తోందంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10 వేల మంది లారీ యజమానులతో పాటు ఈ రంగంపై ఆధారపడిన మరో 25 వేల మంది కార్మికుల ఉపాధిని దృష్టిలో పెట్టుకోవాలంటున్నారు. అదేసమయంలో ప్రకృతి విపత్తుల సమయంలో పన్ను మినహాయింపులు ఇవ్వాలంటున్నారు. తమ సమస్యలపై ఒకటి రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు సమాయత్తమవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-కోదాడ)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇతర రాష్ట్రాలకు లారీలు వెళ్లేందుకు ఏడాదికి రూ.5వేలు చెల్లిస్తే సరిపోయేది. రాష్ట్రం ఏర్పాటయ్యాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లాలంటే ఒక్కసారికి రూ.5 వేలు చెల్లించాల్సి వస్తోంది. ఇలా ఏడాదికి రూ.60 వేలు చెల్లిస్తే ఎన్నిసార్లయినా వెళ్లిరావచ్చు. అయితే దేశంలో ఎక్కడా లేని విధానంతో రాష్ట్రానికి చెందిన లారీ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. పక్క రాష్ట్రమే కావడంతో తరుచూవెళ్లాల్సి వస్తుండటంతో రూ.60 వేలు చెల్లిస్తున్నారు. అదే సమయంలో ప్రకృతి విపత్తుల సమయంలో ఇచ్చే క్వార్టర్ ట్యాక్స్ మినహాయింపులు ప్రస్తుతం అమలుచేయడం లేదు. దీంతో వాహనాలు నడవక ట్యాక్స్‌లు, ఈఎంఐలు కట్టలేక యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. 15ఏళ్లుదాటిన వాహనాలకు పెంచిన చార్జీలు, పెరిగిన మిగతా 6వ పేజీలో

సింగిల్ పర్మిట్ విధానం అమలుచేయాలి



రెండు రాష్ట్రాల మధ్య సింగిల్ పర్మింట్ విధానాన్ని అమలు చేస్తే ఒక్కొక్క లారీ యజమానికి ఏడాదిలో రూ.55 వేల పన్ను భారం తగ్గుతుంది. ఇప్పటికే అద్దెలు లేక ఇబ్బందులు ఉంటే, పన్ను పోటుతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- గుమ్మడి దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్

సమాజంలో పోలీసుల పాత్ర మరవలేనిది

రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



అమరులకు నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ



నల్లగొండ/నల్లగొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర మరవలేనిదని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్‌పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తొలుత పోలీస్ అమరులకు నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఏ స్వార్థం లేకుండా సమాజం కోసం ప్రాణాలర్పించడానికైనా వెనకాడని సేవకులు పోలీసులు అని కొనియాడారు. పోలీస్‌స్టేషన్ అంటే భయపెట్టే కేంద్రం కాదని, బాధలను తీర్చే కేంద్రమన్నారు. విధి



నిర్వహణలో జిల్లాలో సుమారు 15 మంది పోలీసులు అమరులయ్యారని, వారి కుటుంబాలకు అండగా ఉంటానన్నారు. అమరులైన పోలీసుల కుటుంబాలకు చేయుతనందించే విషయంపై సీఎంతో చర్చించి ఆదుకుంటామన్నారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు. తక్షణ సాయంగా ఒక్కొకరికి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. వారి పిల్లల ఉన్నత చదువులకు అవసరమయ్యే ఖర్చులకు సైతం అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సినారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ రాములునాయక్, మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జడ్పీ మాజీ సభ్యుడు వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

10 రోజుల్లో బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులో నీరు

నల్లగొండటౌన్: వచ్చే 10 రోజుల్లో బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టును నీటితో నింపుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అలాగే కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.

నల్లగొండ మండలం ఖాజీ రామారంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.20లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామంలో నిర్మించనున్న ఎల్లమ్మ దేవాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, గతంలో ఖాజీరామారం గ్రామానికి బీటీ రోడ్డు వేయించానని, సబ్‌స్టేషన్ నిర్మించానని, ఇటీవల డీ-39 కాల్వను శుభ్రం చేయించినట్లు తెలిపారు. ఖాజీరామారంలో గత పదేళ్లలో ప్రభుత్వం ఒక్క ఇంటిని కట్టలేదన్నారు. గ్రామానికి 50 ఇళ్లు మంజూరుచేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీదేవి, ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, జడ్పీ మాజీ సభ్యులు లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మాడ్గులపల్లి మండల కేంద్రంలో రూ.50లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలం ఏర్పాటైనా పూర్తిస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు లేవని, ప్రభుత్వ స్థలం మూడు ఎకరాల్లో ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. మాడ్గులపల్లి-మామిడాల వరకు డబుల్‌రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని, రానున్న రోజుల్లో చిరుమర్తి-సూర్యాపేట వరకు డబుల్ రోడ్డు పనులను చేపడతామన్నారు. ఏ పార్టీతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. మండల కేంద్రంలో ఉన్న నల్లకుంట చెరువును నింపేందుకు రూ.2లక్షలతో మోటార్లు ఏర్పాటుచేయిస్తానన్నారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఎంపీడీవో స్వామి, తహసీల్దార్ పద్మ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, జడ్పీ మాజీ సభ్యుడు పుల్లెంల సైదులు, గోపాల్‌రెడ్డి, నరసింహా, సైదిరెడ్డి, వెంకన్న, నరేష్, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, లచ్చయ్య, యాదగిరి, వెంకట్‌రెడ్డి, సిద్దార్థరెడ్డి, బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైటీపీఎస్ నిర్వాసితులకు ఉద్యోగాలు

సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) నిర్వాసితులకు ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్టు సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దామరచర్ల మండలం వీర్లపాలెంలో వైటీపీసీ నిర్మాణం సమయంలో భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం పరిహారం అందించగా, నిర్వాసిత కుటుంబాలకు ఉపాధి అవకాశం కల్పించనున్నదన్నారు. థర్మల్‌పవర్‌ప్లాంట్ ఏర్పాటుతో 169 కుటుంబాలు ఇళ్లు కోల్పోగా, పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. అయితే ఇళ్లను కోల్పోయిన బాధిత కుటుంబం నుంచి ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తొలి విడత 133 కుటుంబాలను ఎంపిక చేశామని, ఆయా కుటుంబాల్లో విద్యార్హతను పరిగణించి ఒకరికి ఉద్యోగం కల్పిస్తామన్నారు. అయితే కుటుంబసభ్యులు ఏకాభిప్రాయంతో అంగీకారపత్రం, విద్యార్హత ధ్రువపత్రాలను సమర్పించాలన్నారు. ఈ నెల 22నుంచి 29 వరకు ధ్రువీకరణ పత్రాలను దామరచర్ల తహసీల్దార్‌కు అందజేయాలన్నారు. తొలివిడత నియామకాలు పూర్తయిన వెంటనే రెండోవిడతలో మిగిలిన మరో 36 కుటుంబాలకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో వైటీపీఎస్ ఈఈ జయరాంరెడ్డి, డీఏవో శ్రీనివాస్‌శర్మ, మిర్యాలగూడ, దామరచర్ల తహసీల్దార్లు హరిబాబు, జవహర్‌లాల్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారం దిశగా చర్యలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజాసమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 25 మంది నుంచి అర్జీలు తీసుకొని బాధితులతో మాట్లాడారు. వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధికం భార్యభర్తల మధ్య పంచాయితీలు, భూవివాదాలకు చెందినవే ఉన్నాయి.

పథకాల అధ్యయనానికి నల్లగొండ వేదిక

కలెక్టర్ సి.నారాయణరెడ్డి



ఆల్‌ఇండియా సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారుల బృందంతో కలెక్టర్

నల్లగొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాల అధ్యయనానికి నల్లగొండ జిల్లా చక్కని వేదిక అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. జిల్లాలో అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అధ్యయనం నిమిత్తం జిల్లాకు వచ్చిన 21 మంది ఆలిండియా సర్వీసెస్, సెంట్రల్ సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారుల బృందం సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుంది. వారితో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం లో నల్లగొండ జిల్లా పెద్దదని, 33 మండలాలు, నాలుగు రెవెన్యూ రెవె న్యూ డివిజన్లతో ఏర్పాటైందని వివరించారు. జిల్లాలో వ్యవసాయం ప్రధా న జీవనాధారమని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ అమలుచేస్తున్నామన్నారు. వీటిని అధ్యయనం చేసేందుకు మారుమూల గ్రామీణ ప్రాంతాలతో పాటు, మునిసిపల్, పట్టణ ప్రాంతాలు జిల్లాలో ఉన్నందున ఇది ప్రొబేషనరీ బృందానికి చక్కగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా పరిశ్రమలశాఖ జేడీ కోటేశ్వర్‌రావు, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతం చేయాలి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. 'ప్రజావాణి'లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కాగా, మొత్తం 63 ఫిర్యాదులు వచ్చాయి.

కర్నాటిపల్లి పంచాయతీలో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

దేవరకొండ: దేవరకొండ మండలం కర్నాటిపల్లి గ్రామానికి సోమవారం ఐదుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు చేరుకున్నారు. ఈనెల 25వరకు వారు పంచాయతీలోనే ఉండి ప్రభుత్వ పథకాల అమలు, ప్రజాసమస్యలు తదితర విషయాలపై అధ్యయనం చేయనున్నారు. ఈ బృందానికి ఎంపీడీవో డానియెల్, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, పలు శాఖల అధికారులు స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు.

మూసీ పునరుజ్జీవానికి అండగా నిలవాలి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



ధర్మారెడ్డి కాల్వలో పూలు చల్లుతున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మూసీ పునరుజ్జీవానికి నకిరేకల్ నియోజకవర్గ ప్రజలు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. సోమవారం సాయంత్రం చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం గ్రామంలో మూసీ నీటితో నిండిన మహాలింగం చెరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలో 80 శాతం మంది ప్రజలు మూసీ నీటిపై ఆధారపడుతున్నారని, మూసీ ప్రక్షాళనతో వారందరి జీవితాలు మెరుగుపడతాయని అన్నారు. మూసీ ప్రక్షాళన జరుగుతుంటే ప్రతిపక్షాలు అడ్డుపడటం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు నర్రా మోహన్‌రెడ్డి, నూతి సైదులు, జడల చిన మల్లయ్య, ఎద్దులపురి కృష్ణ, పరమేశం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

నార్కట్‌పల్లి, కేతేపల్లి, నకిరేకల్: తమ ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నియోజకవర్గంలోని నార్కట్‌పల్లి, కేతేపల్లి, నకిరేకల్ మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు.

● నార్కట్‌పల్లి మండలంలోని చిప్పలపల్లి, బెండల్‌పహాడ్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నార్కట్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ కసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, పాల్గొన్నారు.

● కేతేపల్లి, నకిరేకల్ మండలంలోని కాసనగోడు, బొప్పారం, గుడివాడ, ఇప్పలగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే వీరేశం ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని అన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఏపీఎం యాదమ్మ, మాజీ జడ్పీటీసీ మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ శేఖర్ పాల్గొన్నారు.

● నకిరేకల్ మండలంలో నాలుగు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ జమీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి'

మర్రిగూడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆర్యోగశ్రీ ఉద్యోగుల సంఘం ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు భూపాల్, రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య కోరారు. సోమవారం హైదరాబాద్‌లో సంఘం ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఇన్‌చార్జి సీఈవో ఆర్వీ కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యమిత్రలకు గతంలో ఇచ్చిన హామీ మేరకు డేటా ఎంట్రీ ఆపరేటర్ కేడర్‌ను తక్షణమే అమలుచేయాలని కోరారు. ఈ మేరకు వారు స్పందించి త్వరలోనే మీ క్యాడర్‌ను మార్పు చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం హైదరాబాద్ అధ్యక్షుడు రాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాటమయ్య గుడి నిర్మాణానికి రూ. లక్ష విరాళం

శాలిగౌరారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం తిరుమలరాయినిగూడెంలో గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన కంఠ మహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి లక్ష రూపాయల విరాళం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు కర్నాటి కృష్ణ, నాయకులు వడ్లకొండ నగేష్, వడ్లకొండ చిన్న సైదులు, ఐతగోని సైదులు, మాజీ ఎంపీటీసీ వడ్లకొండ భిక్షంగౌడ్, రామకృష్ణ, వెంకన్న, లింగయ్య, రవి పాల్గొన్నారు.

సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటు వద్దు



పెద్దకాపర్తిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రామస్థులు, విద్యార్థులు

చిట్యాలరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి జిల్లా రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటు చేయవద్దని పెద్దకాపర్తి గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో విద్యార్థులు, గ్రామస్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుతో సమీపంలో ఉన్న తమ గ్రామానికి కాలుష్యం వ్యాపించే అవకాశం ఉందని, దీంతో అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 23వ తేదీన నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు మర్రి జలందర్‌రెడ్డి, చేకూరి గణేష్, ముద్దసాని రమణారెడ్డి, ఆవుల జానయ్య, నీలకంఠం లింగస్వామి, మాచర్ల యాదగిరి, సాగర్ల నాగరాజు, ఏర్పుల గణేష్, పున్న విష్ణు, నూతి తిరుమలేష్, ఏర్పుల రాకేష్, దామోదర్, పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి

నకిరేకల్, అక్టోబరు 21: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని డీఎస్‌వో వెంకటేశ్వర్లు అన్నారు. నకిరేకల్‌లోని చీమలగడ్డలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నకిరేకల్‌లో కొనుగోలు చేసిన నాలుగు లారీల ధాన్యాన్ని కట్టంగూరు మండలంలోని గోదాముకు పంపినట్లు తెలిపారు. మిల్లర్ల జాప్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నందున ధాన్యాన్ని కాంటా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం హరీష్, డీటీటీఎస్ అధికారి జ్యోతి, ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మనిల్లును చూసొద్దామా

● ఆకట్టుకునేలా మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు ఇల్లు
● పురాతన, అందమైన శిల్పాలకు నిలయం
● ఇంటి చుట్టూ 300 రాళ్లు




ఇంటి మొత్తలకు నిలబెట్టిన రాతి స్థంభాలు, ముఖద్వారం ఎదుట ఉన్న వివిధ ఆకృతుల్లోని రాళ్లు

వివిధ ఆకృతుల్లోని రాళ్ల శిల్పాలను చూస్తుంటే ఏదో చారిత్రక కట్టడమో, ప్రాంతామని అనుకుంటాం కదా.. అలాంటి భావనే కలుగుతుంది మట్టిమనిషిగా సుపరిచితుడైన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఆలగడపకు చెందిన వేనేపల్లి పాండురంగారావుకు చెందిన 'మనిల్లు'ను చూస్తుంటే.. 10 మంది కలిసి లేపలేని రాతి స్థంభాలు మొదలు చిన్నచిన్న గులకరాళ్ల వరకు సేకరించారాయన. వాటన్నింటిని కలిపి ఇంటి పరిసరాల్లో అమర్చాడు. ఎందుకంటే అవన్ని తనతో రహస్యంగా సంభాషిస్తాయంటారు. పురాతన శిల్పాలు, ఆలయ మంటపాల స్థంబాలు, ఏదో ఒక ఆకృతి పోలిన రాళ్లను చూస్తే బాధ్యులతో మాట్లాడి ఇంటికి చేరుస్తుంటాడు. ప్రజాఉద్యమాలు ఓ వైపు చేస్తూనే తనఅభిరుచికి తగినట్టుగా కళా హృదయంతో అనేక రకాల వస్తువులను సేకరిస్తున్నారు. మెత్తంగా ఆయన జీవనశైలి నవ నాగరికతకు భిన్నంగా ఉంటుంది. భిన్నత్వంలో ఏకత్వం, మట్టి వాసనలు పరిమళిస్తుంటుంది. నిరాదరణకు గురైన పురాతన, శిల్పసౌందర్య రాళ్లను ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి ఆయన వాటిని తరిలించుకొస్తారు. ప్రస్తుతం ఆ యన వద్ద నాడు రచ్చబండలకు వాడే రాతి అరుగులు మొదలు అంతరించిపోతున్న రుబ్బరోళ్ల వరకు 300కుపైగా ఉన్నాయి.



(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)



బూటు కాలును పోలిన రాయి



పురాతన నంది తలభాగం

రాళ్లను సేకరించాలని ఎలా అనిపించిందంటే..



పౌరహక్కుల సంఘంలో బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో బెల్లి లలిత మరణవార్త తెలిసి నల్లగొండ వెళ్లేందుకు ఇంటి ముందు బస్సుకోసం నిరీక్షిస్తున్నా. ఆ సమయంలో కాళ్లకు రాయి తగిలింది. దాని స్పర్శ అదోలాగా ఉంది. ఏదో వింత అనుభూతి కలిగింది. తొందరలో దానిని పట్టించుకోకుండా వెళ్లిపోయా. రెండు రోజుల తరువాత కూడా జ్ఞాపకం నన్ను వెంటాడింది. ఆ చోటుకు వెళ్లి రాయిని తవ్వి పైకి తీశాను. అది అచ్చం ఆడవాళ్ల ఎత్తు మడమ చెప్పులా వుంది. దానిని ఇంటికి తెచ్చా. అప్పటి నుంచి రాళ్లతో రహస్య సంభాషణ ప్రారంభించా. రాళ్లలో జీవముంది. జీవితాంతం రాళ్ల సేకరణ సాగుతుంది. సాధ్యమైనంత త్వరలో మ్యూజియంను ఏర్పాటు చేస్తా.

- వేనేపల్లి పాండురంగారావు



గతంలో ఉన్న బస్ షెల్టర్.(ఫైల్)

హమ్మయ్య..

బస్ షెల్టర్ తొలగించారు

నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముకుందాపురంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై పంట కాల్వ వెంట నిర్మించిన బస్ షెల్టర్ ప్రమాదకరంగా ఉండటంతో చివరికి హైవే అధికారులు దీన్ని తొలగించారు. బస్సు షెల్టర్ కింది భాగం కోతకు గురై రోజు రోజుకూ మట్టి కొట్టుకుపోతుండటంతో ఏ క్షణంలో ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఇంతకాలం ఆందోళన చెందారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' సైతం ప్రచురించింది.అయితే తొలగించిన బస్ షెల్టర్‌నుమరోచోట అనువైన స్థలంలో ఏర్పాటు చేస్తామని నేషనల్ హైవే డీఈ బాలానాయక్ తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, నిడమనూరు



ముకుందాపురంలో బస్సు షెల్టర్ నిర్మించి, తొలగించిన ప్రదేశం.

ముగిసిన బస్తాల పంచాయితీ

● సోమవారం నుంచి ప్రారంభమైన కొనుగోళ్లు



బస్తాల్లోకి ధాన్యం ఎత్తుతున్న హమాలీలు

తిరుమలగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు, హమాలీల మధ్య బస్తాల పంచాయితీ ముగిసింది. ఈ నెల 16వ తేదీన ప్లాస్టిక్ బస్తాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపట్టమని హమాలీలు మొండికేశారు. దీంతో కొనుగోళ్లు నిలిచాయి. అటు వ్యాపారులు గన్నీ బ్యాగులు లేవని టెండర్లు వేయలేదు. దీంతో రైతులు ఆందోళన చేశారు. అయినప్పటికీవ్యాపారులు,హమాలీలు ఎవరి మాటపై వారు పట్టుదలతో ఉండటంతో పలు పర్యాయాలు చర్చలు జరిపారు. ఎమ్మెల్యే సామేల్ ఇరువర్గాల వారితో చర్చించారు. అనంతరం మార్కెట్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు ఖరీదుదారులు, హమాలీ సంఘాలతో సమావేశమై సమస్యను పరిష్కరించారు. 80శాతం గన్నీ బస్తాలు, 20శాతం ప్లాస్టిక్ బ స్తాల ద్వారా తూకాలు జరిపేందుకు హమాలీలు అంగీకరించారు. దీంతో సోమవారం నుంచి మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ధాన్యం తూకం కోసం గన్నీ బస్తాలతో పాటు ప్లాస్టిక్ బస్తాలు సమకూర్చారు. కొనుగోళ్లు సాఫీగా సాగాయని, ఇక మీదట సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు.

సోమవారం 10 వేల బస్తాల ధాన్యం

తిరుమలగిరి మార్కెట్‌కు సోమవారం 200 మంది రైతులు 10,692 బస్తాల్లో 6,842 క్వింటాళ్ల దాన్యం తీసుకువచ్చారు. వీటిలో ఆర్ఎన్ఆర్ రకం 180 బస్తాల్లో 115 క్వింటాళ్లు రాగా గరిష్ఠంగా రూ.2,163, కనిష్ఠంగా రూ.1,223 ధరలు పలికాయి. ఎస్ఎం రకం 1,030 బస్తాల్లో, 659 క్వింటాళ్ల ధాన్యం రాగా గరిష్ఠంగా రూ.3,089, కనిష్ఠంగా రూ.2,003 ధరలు రాగా, ఐఆర్-64 రకం 9482 బస్తాల్లో 6,068 క్వింటాళ్ల ధాన్యం రాగా గరిష్ఠంగా రూ.1,992, కనిష్ఠంగా రూ.1,870 ధరలు నమోదైనట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు.

అదనపు ధాన్యం ఇవ్వొద్దు

తిరుమలగిరి మార్కెట్‌లో అధికారులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం తూకం వేసే సమయంలో రైతుల నుంచి దడవాయి, హమాలీలు, స్వీపర్లు ధాన్యం తీసుకోవద్దని, తీసుకుంటే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఫ్లెక్సీలో పేర్కొన్నారు. కొన్నేళ్లుగా మార్కెట్‌కు పంటలను తీసుకొస్తున్నామని, తూకం సమయంలో డిమాండ్ చేసి ధాన్యం తీసుకుంటున్నారని రైతులు తెలిపారు. ఇన్నాళ్లకు అధికారులు స్పందించి వారిని హెచ్చరించడం సంతోషం కలిగిస్తోందన్నారు.



ఏపీకి వెళ్లాలంటే.. రూ.5వేలా?

(5వ పేజీ తరువాయి)

ఇన్సూరెన్స్ రేట్లతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సింగిల్ పర్మిట్ విధానంపై నిర్ణయం తీసుకుంటామని మ్యానిఫెస్టోలో ప్రకటించింది. దీంతో లారీఓనర్స్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారు. అధికారంలోకి వచ్చాక సింగిల్ పర్మిట్ విధానంపై స్పష్టత రాకపోవడంతో వారు ప్రభుత్వంపై కినుక వహిస్తున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10వేల పైగా లారీ లు ఉన్నాయి. అమలుకాని సింగిల్ పర్మిట్ విధానంతో పాటు, సెప్టెంబరు నెలలో కురిసిన వర్షాలకు లారీలు రోడ్లు ఎక్కకపోవటం, రూపాయి చేతికి అందకపోవటంతో వారికి నెలవారీ వాహన ఈఎంఐలతో పాటు ఇన్సూరెన్స్, క్వార్టర్ టాక్స్‌ల చెల్లింపు పెనుభారంగా తయారయ్యాయి. దీంతో ఆ రంగంపై ఆధారపడిన మరో 25 వేల మంది సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రవాణా రంగం కష్టాలను నుంచి గట్టేందుకు ప్రభుత్వం సహకరించాలని లారీ ఓనర్స్ కోరుతున్నారు.

రాష్ట్రం విడిపోయాకే ఇబ్బందులు

ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోయాక లారీ ఓనర్స్ వాహనాలు నడపటం కష్టంగా తయా రైందని లారీ యజమానులు తెలిపారు. ముఖ్యం గా ఆంధ్రప్రదేశ్‌కి లారీలను పంపించటం తలకు మించిన భారంగా మారిందని వాపోతున్నారు. సింగల్ పర్మిట్ విధానం అమలుకు నోచుకోకపోవడమే అంటున్నారు. మోటారు వాహనాల చట్టంప్రకారం పక్క రాష్ట్రాలకు వెళ్లటానికి సింగల్ పర్మిట్ విధానంలో రూ.5 వేలు కడితే లారీ సంవత్సరంలో ఎన్ని సార్లయినా ఆ రాష్ట్రంలోకి సరుకు తీసుకెళ్లిరావచ్చు. కానీ రాష్ట్రం విడిపోయాక ఆంధ్రప్రదేశ్ వెళ్లడానికి ఆ చట్టం అమలుకాకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని లారీ యజమానుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుమ్మడి దుర్గాప్రసాద్ తెలిపారు. వారం పర్మిట్‌కు (ఒకసారి వెళ్లిరావటానికి) రూ.2 వేలు, నెలకు రూ.5 వేలు చెల్లించాల్సి వస్తోందని, ఏడాదికి రూ.60 వేలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితి లేదంటున్నారు. నేషనల్ పర్మిట్‌కే సంవత్సరానికి రూ.17 వేలు ఉందంటున్నారు. అటువంటిది పక్క రాష్ట్రానికి వెళ్లటానికి రూ.60 వేలు చెల్లించాల్సి వస్తోందన్నారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ వెళ్లటానికి రూ.5 వేలు చెల్లిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ విషయానికి వచ్చేటప్పటికీ పూర్తిగా భిన్నంగా ఉందంటున్నారు. దీంతో టాక్స్ రూపంలో రూ.లక్షల్లో తాము నష్టపోతున్నామంటున్నారు. ఈ విషయం ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేశామమని, సింగిల్ పర్మిట్ విధానాన్ని అమలుచేయాలని ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏపీ ప్రభుత్వంతో మాట్లాడి సింగిల్ పర్మిట్ విధానం తీసుకువస్తే పన్ను పో టు నుంచి తప్పించినట్లు అవుతుందంటున్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలంటున్నారు.



పన్నులు భరించలేక పోతున్నాం

రాష్ట్ర విభజన అనంతరం తగ్గాల్సిన పన్నులు తగ్గకపోగా పెరిగాయి. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు లారీ యజమానుల మేలును దృష్టిలో పెట్టుకోవాలి. మోటారు యాక్టు ప్రకారం పన్నులను తగ్గిస్తే మంచిది. లేదంటే వాహనాలు నడపటం కష్టం.

- శ్రీనివాసరావు, చైర్మన్,రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్

కౌంటర్ సిగ్నేచర్ ఫర్ సింగిల్ స్టేట్ పర్మిట్‌తో తగ్గనున్న భారం

కౌంటర్ సిగ్నేచర్ ఫర్ సింగిల్ స్టేట్ పర్మిట్‌కు ప్రభుత్వం అనుమతి ఇస్తే, లారీపై రూ.5వేలు ట్యాక్స్ కడితే, ఏడాదిలో లారీ ఏపీకి ఎన్నిసార్లు అయినా వెళ్లిరావచ్చు. దీంతో ఒక లారీపై యజమానిపై ఏడాదిలో అదనంగా రూ.55 వేలు భారం తగ్గుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో మద్రాసు వెళ్లినప్పుడు, ప్రభుత్వం ఏవిధానం కొనసాగించిందో అది కొనసాగిస్తేనే రవాణా రంగం మనుగడ ఉంటుందన్నారు.

సీఎంను కలిసేందుకు సమాయత్తం

సమస్యల సాధన కోసం సెప్టెంబరు 29న కరీంనగర్ జిల్లా పెద్దపల్లిలో రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించింది. ఇందులో సింగిల్ పర్మిట్ విధానం అమలు, ప్రకృతి విపత్తు సమయంలో ట్యాక్స్ మినహాయింపుపై తెచ్చిన జీవో 64ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఆ జీవో ఆధారంగానే గత ప్రభుత్వం కరోనా సమయంలో రెండు క్వార్టర్ ట్యాక్స్‌ల మినహాయింపు ఇచ్చిందని, అదే తరహాలో ప్రస్తుత ప్రభుత్వం సెప్టెంబరులో కురిసిన వర్షానికి లారీలు రోడ్డు ఎక్కలేదని, క్వార్టర్ టాక్స్ మినహాయింపు ఇవ్వాలంటున్నారు. అదేవిధంగా వాహనాలకు విధించే అపరాధ రుసుంను వసూలు చేయవద్దని తెచ్చిన జీవో 588ను అమలుచేయాలంటున్నారు. 15 ఏళ్ల దాటిన వాహనాలకు ఫిటినెస్ చార్జీలు, గత ప్రభుత్వానికి ముందు రూ.2వేలు ఉండేవని, వాటిని రూ.13,700లకు పెంచిందని, ఆ చార్జీలను తగ్గించాలంటున్నారు. కాలం చెల్లిన వాహనాలను జిల్లా పరిధిలో తిప్పుకోవటానికి అవకాశం ఇవ్వాలంటున్నారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సహకరించాలని అసోసియేషన్ తీర్మానించింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డిను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు అసోసియేషన్ సిద్ధమైంది.

రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం

» డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



మునుగోడులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

చిట్యాలరూరల్, మునుగోడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం, మునుగోడులో కార్తీకేయన్ పత్తి జిన్నింగ్ మిల్లులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటలనువిక్రయించాలన్నారు. రైతులకిచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రూ. 2లక్షల రుణమాఫీ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన విషయమన్నారు. మునుగోడులో ఏడీఏ వేణుగోపాల్, చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి కత్తుల రవి, సీసీఐ బయ్యార్ బల్బంద్ర నింజా, మాజీ ఎంపీపీ పోలగోని సత్యం, కర్నాటి స్వామి యాదవ్, మాజీ జడ్పీటీసీ జాజుల అంజయ్య, పిట్టంపల్లిలో వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, వైస్‌చైర్మన్ బొంతల అంజిరెడ్డి, డైరెక్టర్లు పిశాటి భీష్మారెడ్డి, గంగాపురం భాస్కర్‌గౌడ్, గడ్డం సత్తిరెడ్డి, టేకుల కవితాఅంజిరెడ్డి, ము రాల గోపయ్య, మామిడి శ్రీరాములు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రీడలకు ఎంపిక



ఎంపికైన గిరిజన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

మఠంపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల గేమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేటలో ఆదివారం జరిగిన జరిగిన అండర్- 14 జిల్లాస్థాయి పోటీల్లో మఠంపల్లి మండలం భీల్యానాయక్‌తండా ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి అఖిల, జయ, 8వ తరగతి విద్యార్థి సంజయ్ ప్రతిభ కనబర్చినట్లు పీడీ నరేశ్ తెలిపారు. ఈనెల 27న నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. విద్యార్థులను హెచ్ఎం వేణుగోపాల్, రాజేష్, ఆదినారాయణ, రవీందర్, మారయ్య అభినందించారు.

కాపాడుకుందామా చరిత్రను..

జీర్ణావస్థకు ఆనవాళ్లు
కాపాడాలని స్థానికుల వేడుకోలు

చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచే కట్టడాలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నో ఉన్నాయి. కొద్దిపాటి మరమ్మతులతో పాటు శ్రద్ధ వహిస్తే వాటిని సంరక్షించే అవకాశం ఉంది. అలాంటి వాటిలో నల్లగొండ జిల్లా వాడపల్లిలోని రెడ్డిరాజుల కాలంనాటి వాడపల్లి ప్రవేశద్వారం, యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని రాచకొండ కోట ద్వరాజ మార్గం ఒకటి.

(ఆంధ్రజ్యోతి-దామరచర్ల)


రాజసం ఉట్టిపడుతూ నాటి చరిత్రకు సజీవసాక్ష్యంగా నిలిచే కట్టడాలు ఆ ప్రాంతానికి శోభతో పాటు ప్రాధాన్యాన్ని తీసుకువస్తాయి. అదే కోవలో నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలో కొలువైన మీనాక్షి అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలోని ప్రవేశద్వారం ఒకటి. 600ఏళ్ల క్రితం రెడ్డిరాజులు నిర్మించిన కోటలు, కోటగోడలు అప్పటిరాజుల రాజదర్పానికి ఆనవాలుగా నిలిచాయి. వాటిలో ఆనాడు నిర్మించిన ప్రవేశద్వారం ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని నిలిచింది. అయితే స్థానిక సిమెంట్ పరిశ్రమల బ్లాస్టింగ్‌ల ప్రభావంతో ఈ ద్వారం కూలిపోయే స్థితి నెలకొంది. ప్రవేశద్వారం మీదుగానే ప్రజలు ఆలయానికి, కృష్ణా-మూసీ నదుల సంగమం వద్దకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే పలు పురాతనకట్టడాలు కాలగర్భంలో కలిసిపోగా, మిగిలిన ఈ ప్రవేశద్వారానికి మరమ్మతులు నిర్వహించి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రాచీన సంపదను కాపాడాలి



పురాతన కట్టడం శిథిలావస్థకు చేరుకుంది. మరమ్మతులు నిర్వహిస్తే ప్రవేశ ద్వారాన్ని కాపాడుకోవచ్చు. ప్రాచీన సంపదను భావితరాలకు అందించేందుకు అధికారులు పాటుపడాలి.

- కొండారపు పూర్ణచందర్ రావు, (వాడపల్లి)



● జీర్ణావస్థకు రాచఠీవి

ఎత్తయిన కొండలు, వాగులు, వంకలతో అలరారే రాచకొండ ఎన్నో చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. రాచరిక పాలన అంతమైనప్పటికీ నేటికీ రాచకొండలో అడుగడుగునా రాచరిక వైభవం ఉట్టిపడుతోంది. ఇట్టే ఆకర్షించే కోటగోడలు, దేవాలయాలు, ఇతర నిర్మాణాలు ఈ ప్రాంత సొంతం. అలాంటి నిర్మాణాలు జీర్ణావస్థకు చేరాయి. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్న ప్రభుత్వాల మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. యాదాద్రిభువనగిరి జిల్లా, రంగారెడ్డి జిల్లాల సరిహద్దుల్లో రాచకొండ ప్రాంతం సుమారు 40,000 ఎకరాలలో విస్తరించి ఉంది. రేచర్ల పద్మనాయకులు నిర్మించిన కోటలు రాచరిక కట్టడాలు దేవాలయాలు నేటికీ ఉన్నాయి. ఎత్తైన కొండపైన ఉన్న సంకండ్ల బావి రాచకొండకు ప్రత్యేక ఆకర్షణ. పదుల సంఖ్యలో దేవాలయాలు ఉన్నాయి. కోటపైకి ఎక్కేందుకు ఉన్న ద్వారాలు, కోటగోడలు కూలిపోతున్నాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ కట్టడాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి - చౌటుప్పల్)



ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్



నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారని కోదాడ ఎంవీఐ జిలానీ అన్నారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కోదాడలోని 35 వార్డులతోపాటు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతోనే అనర్థాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లుతోపాటు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఎంవీఐ: అంతర్గత రహదారులతోపాటు, జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : రోడ్డు ప్రమాదాలకు కారణాలు?

ఎంవీఐ: రోడ్డు ప్రమాదాలకు కారణం అతివేగం, నిర్లక్ష్యం, మద్యం తీసుకొని డ్రైవింగ్ చేయడం కారణం.

ఆంధ్రజ్యోతి: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా చాలామంది ఆటోలు నడుపుతున్నట్లు సమాచారం. వారిపై ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంవీఐ: ఇప్పటికే చాలామంది లైసెన్స్ లేకుండా ఆటోలు నడుతున్నవారిని గుర్తించాం. అలాంటి వారికి భారీ జరిమానాలు విధించాం. పరిమితికి మించి వాహనం నడిపేవారి వాహనాలు సీజ్ చేస్తున్నాం. ముందు సీట్లో ఎవరినైనా కూర్చోబెట్టుకొని డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: ఆటోవాలలతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు గణాంకాలు ఉన్నాయి. వాటిపై మీ స్పందన?

ఎంవీఐ: వాస్తవమే.. ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: రహదారులపై, ముఖ్యంగా రామాపురం క్రాస్‌రోడ్డు, ఆకుపాముల, మునగాల, మొద్దుల చెరువు వద్ద ప్రమాదాలకు కారణం

ఎంవీఐ: రహదారి డిజైన్‌లో లోపంతో పాటు, రోడ్డు హిప్నాటిజంతో ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు సుదూరం ప్రయాణించడం, అలసట, నిద్రమత్తుతో వాహనాలు నడపడంతో ప్రయాదాలు జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: ప్రమాదాల నివారణకు పోలీసుల సహకారం తీసుకుంటారా

ఎంవీఐ: ఉమ్మడిగానే ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం. ఎప్పటికప్పుడు పోలీసు శాఖతో మాట్లాడుతూ, ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: మైనర్ల డ్రైవింగ్‌పై మీ చర్యలు?

ఎంవీఐ: తల్లిదండ్రులు పిల్లలకు చిన్నప్పుడే వాహనాలు ఇవ్వొద్దు. వారికి డ్రైవింగ్‌పై అవగాహన ఉండదు. ఫలితంగా ప్రమాదాలు జరుగుతు న్నాయి. అంతేకాక పిల్లలు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతు న్నారు. 18 సంత్సరాలు వచ్చే వరకు పిల్లలకు వాహనాలు ఇవ్వకూ డదు. డ్రైవర్లు మత్తుపానియాలు తీసుకొని వాహనాలు నడపవద్దు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఎవరూ రోడ్డుపైకి రావొద్దు. ● (ఆంధ్రజ్యోతి), కోదాడ

క్రైం పాయింట్
Crime point

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రశాంత్ మృతదేహం

మద్దిరాల, అక్టోబరు 21: గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలకేంద్రం పెట్రోల్‌బంక్ సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడబంగ్లా మండలం గునాశీపురం గ్రామానికి చెందిన అంబోతు ప్రశాంత్(26) బైక్‌పై అత్తాగారిల్లు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హమ్మపురం గ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యలో 365వ జాతీయ రహదారి, మద్దిరాల మండలకేంద్రం పెట్రోల్‌బంక్ సమీపంలో బైక్‌ను గుర్తువాహనం ఢీకొనడంతో ప్రశాంత్ మృతిచెందాడు. స్థానికులు ప్రైవేట్ వాహనంలో తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పట్టుబడిన మద్యం సీసాలు ధ్వంసం

గరిడేపల్లి, అక్టోబరు 21: గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. పట్టుబడిన 48 బాక్స్‌ల మద్యం బాటిళ్లను హుజూర్‌నగర్ ఎక్సైజ్ ఎస్‌ఐ వెన్నెల, ఎస్‌ఐ చలికంటి నరేష్‌ల ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది చాగంటి నాగయ్య, రవి, బాలు, నాగరాజు, పోలీసు సిబ్బంది నగేష్, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

కట్టంగూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలకేంద్రంలోని అంబటివాగు గ్రామంలో సోమవారం జరిగింది. బాధితురాలు ముదిరెడ్డి భద్రమ్మ తెలిపిన వివరాల.. ప్రకారం రోజువారిగా తన గేదెలను మేత మేపేందుకు తోలుకుపోతుండగా బీసీ హాస్టల్ సమీపంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో గేదెలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. గేదెల విలువ రూ.1.20లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపింది.

ఇంటి వద్ద పార్క్‌చేసిన కారు చోరీ

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్క్‌చేసిన కారును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు చౌరస్తా వద్ద సోమవారం జరిగింది. రూరల్ ఎస్‌ఐ లోకేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నందిపాడు బైపాస్ సమీపంలో నివాసముంటున్న రామాంజనేయులు ఆదివారం రాత్రి ఇంటికి వచ్చి తన ఏపీ28బీఎ్‌స1123 నెంబర్ గల కారును ఇంటి వద్ద పార్క్‌చేశాడు. సోమవారం ఉదయం 9గంటలకు కారును శుభ్రపరిచి ఇంట్లోకి వెళ్లాడు. ఉదయం 10:30గంటల సమయంలో పని నిమిత్తం కారులో వెళ్లేందుకు ఇంట్లో నుంచి బయటకు రాగా కారు కన్పించలేదు.

కంగారుపడిన రామాజంనేయులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నందిపాడు చౌరస్తా సమీపంలోని సీసీకెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. అయితే చోరీకి గురైనట్లుగా భావిస్తున్న కారుకు సంబంధించి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు యజమాని వద్దలేవని ఎస్‌ఐ తెలిపారు. సదరు కారును రామాంజనేయులు సోదరుడు రాము కర్నాటక రాష్ట్రం నుంచి తెచ్చి ఇచ్చినట్లుగా గుర్తించామని ఎస్‌ఐ తెలిపారు. చోరీకి గురైన కారు కేసు అనుమానాస్పదంగా ఉందని, అన్నికోణాల్లో విచారిస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్‌కుమార్ తెలిపారు.

అప్పులపాలయ్యాం.. ఆదుకోరూ..



వర్షాల కారణంగా నిలిచిపోయిన నేరేడుగొమ్మ మండలంలోని అంభాభవాని లిఫ్ట్ పనులు

- మిషన్‌భగీరథ, లిఫ్టు ఎత్తిపోతల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు
- ఏళ్లు గడుస్తున్నా మిషన్‌భగీరథ బిల్లులు రావడం లేదని ఆవేదన
- చేసిన లిఫ్ట్ పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ల ఇబ్బందులు
- పూర్తిచేసిన పనులకు బిల్లులు చెల్లించాలని వేడుకోలు

దేవరకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): 'కోట్లాది రూపాయల అప్పులు చేసి మిషన్ భగీరథతోపాటు గుట్టలపై ఉన్న ప్రాంతాల లిఫ్టుల పనులు చేపట్టాం. కానీ చేసిన పనులకు ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులుపడుతున్నాం. ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించి బిల్లులు చెల్లించి ఆదుకోవాలి' ఇదీ మిషన్‌భగీరథతోపాటు లిఫ్టుల ఎత్తిపోతల పథకం కాంట్రాక్టర్ల ఆవేదన. నల్లగొండ జిల్లా దేవరకొండ డివిజన్‌లోని మిషన్‌భగీరథ పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా చేసిన పనులకు బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతపల్లి మండలానికి చెందిన రమారావు అనే కాంట్రాక్టర్ 2018లో రూ.27లక్షలతో మిషన్‌భగీరథ పైప్‌లైన్‌లు, నల్లాల పనులకు అగ్రిమెంట్ చేసుకొని సంవత్సరంలోపే పనులను పూర్తిచేశారు. పైప్‌లైన్ పనులు పూర్తికావడంతో మంచినీరు సరఫరా అవుతోంది. కాని చేసిన పనులకు సంబంధించి రూ.7లక్షలకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నల్లగొండ, హైదరాబాద్‌లోని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితంలేకుండా పోయిందని ఆయన వాపోయారు. చింతపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కాంట్రాక్ట్ పనులు కూడా చేస్తుంటాడు. ఆయన 2019లో రూ.60లక్షలతో పైప్‌లైన్ పనులు పూర్తిచేశాడు. ఇప్పటి వరకు రూ.25లక్షల బిల్లులే వచ్చాయి. మిగితా రూ.35లక్షల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఐదు సంవత్సరాల క్రితం పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు రాకపోవడంతో హైదరాబాద్‌లో ఇల్లు అమ్ముకొని విధిలేని పరిస్థితిలో అప్పులు తీర్చాల్సి వచ్చిందని తన గోడును వెలిబుచ్చారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా చేసిన పనులకు 2019లోనే బిల్లులు రాలేదని ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. 2023 అక్టోబరులో చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని హైదరాబాద్ వెళ్లి మిషన్‌భగీరథ ఇంజనీరింగ్ చీఫ్ కృపాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం కూడా అందజేశామని తెలిపారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపించాలి

మిషన్‌భగీరథ ద్వారా చేపట్టి పూర్తయిన పనుల వివరాల నివేదికను ఉన్నత అధికారులకు పంపించాం. కాంట్రాక్టర్‌లకు కొంతమేర చేసిన పనులకు డబ్బులు వస్తున్నాయి. పూర్తిస్థాయిలో చేసిన పనులకు డబ్బులు అందేవిధంగా ఉన్నత అధికారులకు తెలియజేస్తాం.

– వెంకటేశ్వర్లు, మిషన్‌భగీరథ ఎస్ఈ.

బిల్లులు రాక.. పనులు సాగక

- దేవరకొండ నియోజకవర్గంలోని చింతపల్లి, గుడిపల్లి, దేవరకొండ, డిండి, పీఏపల్లి మండలాల్లోని కాంట్రాక్టర్లకు చేసిన పనులకు బిల్లులు రాకపోవడం, పెట్టుబడులు వడ్డీకి తేవడంతో పెనుభారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి చేసిన పనులకు బిల్లులు వచ్చేలా చూసి ఆదుకోవాలని మిషన్‌భగీరథ పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లు వేడుకుంటున్నారు.
- నాగార్జునసాగర్ ముంపునకు గురైన బాధితులు చందంపేట, నేరేడుగొమ్ము, పీఏపల్లి మండలాలలోని గుట్టలపై ఉన్న గ్రామాల్లో పునరావాసం ఏర్పాటు చేసుకొని పంటలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. ఆ గ్రామాల రైతులకు లిఫ్టుల ద్వారా సాగునీరు అందించాలని 2021 ఫిబ్రవరి 19న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేశారు. నిధులు కేటాయించకపోవడం, అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో కొన్ని లిఫ్టుల పనులు మందకొడిగా సాగుతున్నాయి. మరికొన్ని శంకుస్థాపనకే పరిమితమయ్యాయి.
- చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంబాలపల్లి అంభా భవాని ఎత్తిపోతల పథకం పనులు 25శాతంపైగా పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు రూ.60 కోట్లకుపైగా బిల్లులు రావాల్సి ఉంది. దీంతో కాంట్రాక్టర్‌లు పనులు నిలిపివేశారు. వర్షాలు కురవడంతో నీరు చేరుకొని పనులు నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు చెల్లించి ఆదుకోవాలని మిషన్‌భగీరథ, ఎత్తిపోతల పథకాల కాంట్రాక్టర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	589
టీఎంసీలు	309.0570
ఎడమకాల్వకు నీటి విడుదల	6.173
కుడికాల్వకు	9.047
విద్యుత్ కేంద్రం ద్వారా	25.100
సాగర్‌కు నీటి రాక	1.79.971
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1.800 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	2.29.692 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	2.22.147 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	20

– నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.67 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	2.39.417
అవుట్‌ఫ్లో	1.82.190 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	7

– మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.60 అడుగులు
టీఎంసీలు	4.10
ఎన్ని గేట్ల ద్వారా	ఒక గేటు ద్వారా
ఇన్‌ఫ్లో	753.35 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	753.35 క్యూసెక్కులు

– కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	20 అడుగులు

– శాలిగౌరారం,(ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3750 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3750 క్యూసెక్కులు

-డిండి,(ఆంధ్రజ్యోతి)

యాదగిరికొండపై హరిహరులకు పూజలు



కొండపై శివాలయంలో ఊరేగింపు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, కొనసాగుతున్న శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారికి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయన ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.14,21,247 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు, కూతురు రీల్స్ చిత్రీకరించినట్లు ఎక్స్‌లో ఆయన పోస్టు చేయగా వివాదమైన సంగతి తెలిసిందే. స్వామివారి ప్రతిష్ఠకు భంగం, భక్తుల విశ్వాసాలు, మనోభావాలకు ఆటంకం కలిగించే ఏ క్రియనైనా అనుమతించబోమని ఈవో సోమవారం ప్రకటించారు. క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తులు జ్ఞాపకార్థం ఆలయం వెలుపల ఫొటోలకు మాత్రమే అనుమతి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇకముందు ఆలయ ప్రాశస్త్యం, భక్తుల విశ్వాసం, ఆధ్యాత్మిక శోభను దృష్టిలో ఉంచుకొని ఇకపై వీడియో, ఫొటోల చిత్రీకరణపై దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు.

ఒకరి పొరపాటు... మరొకరి అత్యాశ

● బస్టాండ్‌లో తారుమారైన బంగారు ఆభరణాల సంచి ● భువనగిరిలో పొరపాటున తీసుకెళ్లిన వ్యక్తి ● సీసీఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసులు



బాధితురాలికి బంగారు ఆభరణాలు అందజేస్తున్న భువనగిరి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి

భువనగిరి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రయాణంలో ఒకరి పొరపాటు మరొకరికి ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఏడు రోజుల్లో ఈ కేసును ఛేదించిన పోలీసులు బాధిత కుటుంబానికి రూ.5లక్షల విలువైన బంగారు ఆభరణాలు అందజేశారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ ఇందుకకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ అంబర్‌పేట్‌లోని గంగానగర్‌కాలనీకి చెందిన గజ్జి జ్యోతి కుటుంబంతో కలిసి దసరా పండుగ కోసం మహబూబాబాద్ జిల్లా కే సముద్రంలోని పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 14వ తేదీన హైదరాబాద్ వెళ్లేందుకు కేసముద్రం బస్టాండ్‌లో బస్సు ఎక్కింది. మార్గమధ్యలో భువనగిరి బస్టాండులో కొంతమంది ప్రయాణికులు కిందికి దిగారు. ఘట్‌కేసర్ వరకు వెళ్లాక తనతో పాటు తెచ్చుకున్న రూ.5లక్షల విలువైన బంగారు ఆభరణాలతో ఉన్న బ్యాగు కనిపించకపోవడంతో ఆందోళనకు గురై వెనక్కి వచ్చి భువనగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బస్టాండ్‌లోని సీసీఫుటేజీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఓ గుర్తుతెలియని ప్రయాణికుడు జ్యోతి బ్యాగును తీసుకుని బస్సు దిగినట్లు గుర్తించారు. ఆ బ్యాగు తనది కాదని గమనించి వెనక్కివచ్చిన ప్రయాణికుడు బస్సు వెళ్లిపోవటంతో ఆ సంచిని బస్టాండ్‌లోనే వదిలి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో మరో గుర్తుతెలియని వ్యక్తి ఆ సంచిని తీసుకుని హైదరాబాద్ వైపు వెళ్లే బస్సు ఎక్కినట్లు సీసీ ఫుటేజీలో తేలింది. పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆభరణాలు ఉన్న సంచిని తీసుకువెళ్లిన వ్యక్తిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వినుకొండ మండలం తిమ్మయ్యపాలెం గ్రామస్థుడిగా గుర్తించారు. మూడు రోజుల క్రితం పోలీసులు అక్కడికి వెళ్లి అతని నుంచి బంగారు ఆభరణాలు ఉన్న సంచిని స్వాధీనం చేసుకుని సోమవారం బాధితురాలికి అప్పగించారు.

23.37ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

● అక్రమంగా పొందిన పట్టాలు రద్దు చేసిన అధికారులు

దామరచర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో అక్రమ పద్ధతిలో ప్రభుత్వ భూములకు పట్టాలు పొందిన సీలింగ్ భూములను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కొత్తపల్లి గ్రామ రెవెన్యూ పరిధి తాళ్లవీరప్పగూడెం శివారులోని 23.37ఎకరాల సీలింగ్ భూమిపై ఉన్న పట్టాలను రెవెన్యూ శాఖ రద్దు చేసి ఆ భూములను స్వాధీనం చేసుకుంటున్నట్లు తహసీల్దార్ జవహర్‌లాల్ సోమవారం తెలిపారు. తాళ్లవీరప్పగూడెం శివారు ప్రాంతంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ సమీపంలోని సర్వే నెం.66లో 15.08 ఎకరాలు, సర్వే నెం.67లో 8.29 ఎకరాలు మొత్తం 23.37 ఎకరాల భూమి గతంలో జాబిశెట్టి శేషమ్మ పేరుతో ఉండగా, 1997లో సీలింగ్ యాక్ట్ ప్రకారం పట్టాదారు నుంచి ప్రభుత్వం అప్పట్లో స్వాధీనం చేసుకుంది. ఆ భూములను నిబంధనలకు విరుద్ధంగా పలువురు పట్టాలు పొంది ధరణిలో పేర్లు నమోదు చేసినట్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు ఆధారంగా అధికారులు విచారణ చేపట్టారు. సర్వే నెం.67లో 8.29ఎకరాలు, సర్వే నెం.66లో 12.33 ఎకరాలకు పట్టా పొందినట్లు గుర్తించారు. భూములపై అంబటి రామాంజనేయులు ఆరు ఎకరాలు, వింజం ముసలయ్య 5.29 ఎకరాలు, సాదినేని శ్రీనివాస్‌రావు 2.25ఎకరాలు, రాయికింది దివ్య 3ఎకరాలు, నాలావత్ కమిలి 3ఎకరాలు, ఇండియా సిమెంట్ పేరుతో ఒక ఎకరం పట్టాలు పొందినట్లు అధికారులు గుర్తించారు. ఆ పట్టాలను రద్దు చేసి భూములను స్వాధీనం చేసుకుటున్నట్లు అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో భూముల విలువ సుమారు రూ.8కోట్లు ఉంటుందని సమాచారం. అదే రెవెన్యూ గ్రామ పరిధిలోని వివిధ సర్వే నెంబర్లలో 120 ఎకరాల సీలింగ్ భూమి ఉండగా, అక్రమంగా పట్టాలు పొందినట్లు ఆరోపణలు రావడంతో ఆ భూములపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

చికిత్సపొందుతూ రిటైర్డ్ ఎస్ఐ మృతి

కేతేపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలకేంద్రానికి చెందిన రిటైర్డ్ ఎస్ఐ అలుగుబెల్లి జగన్మోహన్ రెడ్డి(62) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందారు. వారం రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. ఆయన ఆరోగ్యం క్షీణించి ఆదివారం సాయంత్రం మృతిచెందారు. జగన్మోహన్‌రెడ్డి మృతదేహాన్ని సోమవారం కుటుంబసభ్యులు స్వగ్రామం కేతేపల్లికి తీసుకొచ్చారు. కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ నాయకులు జగన్మోహన్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

బైక్ దొంగ అరెస్ట్



భువనగిరి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా పోలీసులు బైక్ దొంగను అరెస్టు చేసి ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ కె. సురేష్‌కుమార్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక తారకరామానగర్‌కు చెందిన మేడి కోటేష్ బైక్ ఈ నెల 17న అపహరణకు గురైంది. దీంతో ఆదే రోజు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సోమవారం భువనగిరిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో నెంబర్ ప్లేట్ లేని బైక్‌ను నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. భువనగిరితో పాటు మరో ఆరు ప్రాంతాల్లో బైక్‌లను అపహరించిన కామారెడ్డి జిల్లా బికనూరు మండలం కంచర్ల గ్రామానికి చెందిన కొక్కు గణేష్‌గా తేలింది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మృత్యువులోనూ యజమాని వెంటే..

● విద్యుదాఘాతంతో రైతుతో పాటు కుక్క మృతి ● సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలో ఘటన



వెంకన్ననాయక్(ఫైల్)



కుక్క కళేబరం

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విశ్వాసానికి ప్రతీకగా నిలిచే ఆ మూగజీవి నిత్యం యజమాని వెంటే ఉంటుంది. ఇంటి వద్ద, పొలానికి వెళ్లి వచ్చేటపుడు ఆయన వెంటే వెళ్లివస్తుంది. అదే క్రమంలో మృత్యువులోనూ యజమానినే అనుసరించింది. సోమవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలోని పీపానాయక్ తండాలో ఈ విషాదం నెలకొంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీపానాయక్ తండాకు చెందిన గుగులోతు వెంకన్ననాయక్(46) మూడున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. వ్యవసాయంతో పాటు పాడిగేదెలు కూడా మేపుతుంటారు. మూడేళ్లుగా ఓ కుక్కను ఇంటిలో పెంచుకుంటున్నారు. సోమవారం సాయంత్రం వెంకన్ననాయక్ తనకున్న నాలుగు గేదెలను మేపేందుకు తండా సమీపంలోని గట్టికల్ శివారుకు వెళ్లాడు. గేదెలను మళ్లించే క్రమంలో కోన రాంబాబుకు చెందిన పొలంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. వెంకన్ననాయక్ వెంట ఉన్న కుక్క కూడా విద్యుత్ వైర్లను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ బావి మోటార్ వరకు కర్ర సాయంతో వైర్లను తీసుకువెళ్లారని, కర్ర పడిపోవడంతో విద్యుత్ తీగలు కిందికి వాలి ప్రమాదానికి కారణమయ్యాయని స్థానికులు తెలిపారు. వెంకన్న భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా



మనీశ్వర్‌గౌడ్ (ఫైల్)

నాగారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన బాలుడు నీట మునిగి మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోట గ్రామంలో ఈ ఘటన జరిగింది. మండలంలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన ఖమ్మంపాటి నాగారాజు-ఉపేంద్ర దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కూమారుడు మనీశ్వర్‌గౌడ్(11) జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు ఆదివారం సెలవు కావడంతో నలుగురు స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలో వున్న టిక్కేరు వాగులో ఉన్న చెక్‌డ్యాంలో ఈత కొట్టడానికి వెళ్లారు. చెక్ డ్యాంలోకి దిగిన మనీశ్వర్‌కు ఈత సరిగా రానందున నీట మునిగి బయటికి రాలేదు. భయభ్రాంతులకు గురైన స్నేహితులు ఇంటికి వచ్చి ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. కూలి పనులకు వెళ్లిన మనీశ్వర్ తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి కుమారుడు లేనందున, ఎక్కడికి వెళ్లాడని అతడి స్నేహితులను అడిగారు. భయంతో జరిగిన ఘటనను వారు వెల్లడించలేదు. కుమారుడి కోసం ఊరంతా వెదికినా కనిపించకపోవడంతో ఎస్ఐ ఐలయ్యకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆదివారం సాయంత్రం గ్రామానికి చేరుకుని మనీశ్వర్ స్నేహితులను వాకబు చేయగా, చెక్ డ్యాంలో ఈతకు వెళ్లామని, నీట మునిగి మునీశ్వర్ బయటకు రాలేదని ఓ స్నేహితుడు పోలీసులకు తెలిపాడు. చెక్‌డ్యాం వద్దకు తల్లిదండ్రులు, గ్రామస్థులతో కలిసి వెళ్లి రాత్రి 12గంటల వరకు వెతికినా ఆచూకీ లభించకపోవటంతో తిరిగి వచ్చారు. సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో చెక్‌డ్యాం వద్దకు మనీశ్వర్ తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు వెళ్లి చూడగా చెక్ డ్యాం ముందు భాగంలో రాతి గుండు సమీపంలో మృతదేహం నీటిపై తేలాడుతూ కన్పించింది. మనీశ్వర్ మృతదేహాన్ని గ్రామస్థులు బయటకు తీశారు. కుమారుడి మృతదేహన్ని చూసి తల్లిదండ్రులు సొమ్మసిల్లి పడిపోయారు. మనీశ్వర్ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి నాగారాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. తలిదండ్రులు నిరుపేదలు కాగా కిరాయి ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. దీంతో కుమారుడి అంత్యక్రియలు అమ్మమ్మ ఊరైన నాగారం బంగ్లాలో నిర్వహించారు.

SRI RAGHAVENDRA COLLEGE OF EDUCATION

Munugode Road, Nalgonda-508001

B.Ed SPOT ADMISSIONS-2024-25

The Following Category-A admission students are not Reported up to 17.10.2024.

The Last chance for reporting at the college on or before 25.10.2024.Otherwise those admissions are treated as cancelled and filled those admissions in Spot as per merit.

SL No.	Rank	Hallticket No.	Candidate Name	Method	Gender	Category	Alloted Category	Region
1	5165	2415302826	V VIJAYA LAXMI	PHY-SCIENCE	F	BC-B	REG_OPEN_OU_FEMALE	OU
2	8143	2415302414	GUDISE NAVYA SREE	BIO-SCIENCE	F	BC-D	REG_OPEN_OU_FEMALE	OU
3	17298	2415103063	TANNIRU SWETHA	BIO-SCIENCE	F	BC-A	REG_BCA_UNR_FEMALE	OU
4	19304	2425705079	RACHAKONDA MAMATHA	BIO-SCIENCE	F	BC-B	REG_BCB_OU_GEN	OU
5	16714	2425105248	NAKIREKANTI MEGHANA	SOCIAL	F	SC	REG_BCD_OU_GEN	OU
6	19875	2425501074	CHERUKUPALLI PRIYANKA	SOCIAL	F	SC	REG_SC_OU_FEMALE	OU

The Candidates who need admission in to B.Ed can attend the Spot admission at the college on 30.10.2024 at 10.00 am with all Original certificates and Tuition Fee TS Ed-CET-2024 Admission Guidelines.

Total No.of Vacancies (Methodology Wise) 1) Mathematics : 00, 2) Phy-Science : 01, 3) Bio-Science : 03, 4) Social : 02, 5) Unfilled : 12, **Total : 18**

Contact No: 9133958840, 9640361973 **Sd/- Secretary**

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

● ఎస్‌ఐ రవీందర్

కట్టంగూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కట్టంగూరు ఎస్‌ఐ రవీందర్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భం గా సోమవారం మండలంలోని అయిటిపాముల గ్రామంలో కానిస్టేబుల్ చెవుగోని నాగరాజు విగ్రహానికి ఆయన మాజీ ప్రజాప్రతి నిధులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, బెజవాడ సైదులు, మర్రి రాజు, మిట్టపల్లి శివశంకర్, బొజ్జ శ్రీను, రెడ్డిపల్లి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా సుదర్శన హోమం

నార్కట్‌పల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతీ నెలా గుట్టపై సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్నారు. లోకకల్యాణం కాంక్షిస్తూ నిర్వహించిన ఈ క్రతువులో పలువురు దంపతులు పాల్గొని యజ్ఞపూజలు చేశారు.

ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

మంగళవారం 22 అక్టోబరు 2024

సమాజంలో పోలీసుల పాత్ర మరవలేనిది

రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



అమరులకు నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ

నల్లగొండ/నల్లగొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర మరవలేనిదని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్‌పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తొలుత పోలీస్ అమరులకు నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఏ స్వార్థం లేకుండా సమాజం కోసం ప్రాణాలర్పించడానికైనా వెనకాడని సేవకులు పోలీసులు అని కొనియాడారు. పోలీస్‌స్టేషన్ అంటే భయపెట్టే కేంద్రం కాదని, బాధలను తీర్చే కేంద్రమన్నారు. విధి నిర్వహణలో జిల్లాలో సుమారు 15 మంది పోలీసులు అమరులయ్యారని, వారి కుటుంబాలకు అండగా ఉంటానన్నారు. అమరులైన పోలీసుల కుటుంబాలకు చేయుతనందించే విషయంపై సీఎంతో చర్చించి ఆదుకుంటామన్నారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు. తక్షణ సాయంగా ఒక్కొకరికి రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. వారి పిల్లల ఉన్నత చదువులకు అవసరమయ్యే ఖర్చులకు సైతం అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సినారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ రాములునాయక్, మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జడ్పీ మాజీ సభ్యుడు వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



10 రోజుల్లో బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులో నీరు

నల్లగొండటౌన్: వచ్చే 10 రోజుల్లో బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టును నీటితో నింపుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అలాగే కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.

నల్లగొండ మండలం ఖాజీ రామారంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.20లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామంలో నిర్మించనున్న ఎల్లమ్మ దేవాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, గతంలో ఖాజీరామారం గ్రామానికి బీటీ రోడ్డు వేయించానని, సబ్‌స్టేషన్ నిర్మించానని, ఇటీవల డీ-39 కాల్వను శుభ్రం చేయించినట్లు తెలిపారు. ఖాజీరామారంలో గత పదేళ్లలో ప్రభుత్వం ఒక్క ఇంటిని కట్టలేదన్నారు. గ్రామానికి 50 ఇళ్లు మంజూరుచేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీదేవి, ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, జడ్పీ మాజీ సభ్యులు లక్ష్మయ్య, పాశం రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మాడ్గులపల్లి మండల కేంద్రంలో రూ.50లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలం ఏర్పాటైనా పూర్తిస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు లేవని, ప్రభుత్వ స్థలం మూడు ఎకరాల్లో ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. మాడ్గులపల్లి-మామిడాల వరకు డబుల్‌రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని, రానున్న రోజుల్లో చిరుమర్తి-సూర్యాపేట వరకు డబుల్ రోడ్డు పనులను చేపడతామన్నారు. ఏ పార్టీతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. మండల కేంద్రంలో ఉన్న నల్లకుంట చెరువును నింపేందుకు రూ.2లక్షలతో మోటార్లు ఏర్పాటుచేయిస్తానన్నారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఎంపీడీవో స్వామి, తహసీల్దార్ పద్మ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, జడ్పీ మాజీ సభ్యుడు పుల్లెంల సైదులు, గోపాల్‌రెడ్డి, నరసింహ, సైదిరెడ్డి, వెంకన్న, నరేష్, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య లచ్చయ్య యాదగిరి, వెంకట్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి, బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి వెళ్లాలంటే రూ.5వేలా?

- సింగిల్ పర్మిట్ విధానంపై నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10 వేల మంది లారీఓనర్స్
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10 వేల మంది లారీఓనర్స్




తెలుగు రాష్ట్రాల మధ్య సింగిల్ పర్మిట్ విధానం అమలు కోసం లారీ యజమానులు కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నారు. పక్కనున్న ఏపీకి వెళ్లిన ప్రతీసారి రూ.5వేలు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేదంటే ఏడాదికి రూ.60 వేలు చెల్లించాల్సి వస్తోందంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10 వేల మంది లారీ యజమానులతో పాటు ఈ రంగంపై ఆధారపడిన మరో 25 వేల మంది కార్మికుల ఉపాధిని దృష్టిలో పెట్టుకోవాలంటున్నారు. అదేసమయంలో ప్రకృతి విపత్తుల సమయంలో పన్ను మినహాయింపులు ఇవ్వాలంటున్నారు. తమ సమస్యలపై ఒకటి రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు సమాయత్తమవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-కోదాడ)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇతర రాష్ట్రాలకు లారీలు వెళ్లేందుకు ఏడాదికి రూ.5వేలు చెల్లిస్తే సరిపోయేది. రాష్ట్రం ఏర్పాటయ్యాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లాలంటే ఒక్కసారికి రూ.5 వేలు చెల్లించాల్సి వస్తోంది. ఇలా ఏడాదికి రూ.60 వేలు చెల్లిస్తే ఎన్నిసార్లయినా వెళ్లిరావచ్చు. అయితే దేశంలో ఎక్కడా లేని విధానంతో రాష్ట్రానికి చెందిన లారీ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. పక్క రాష్ట్రమే కావడంతో తరుచూవెళ్లాల్సి వస్తుండటంతో రూ.60 వేలు చెల్లిస్తున్నారు. అదే సమయంలో ప్రకృతి విపత్తుల సమయంలో ఇచ్చే క్వార్టర్ ట్యాక్స్ మినహాయింపులు ప్రస్తుతం అమలుచేయడం లేదు. దీంతో వాహనాలు నడవక ట్యాక్స్‌లు, ఈఎంఐలు కట్టలేక యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. 15ఏళ్లుదాటిన వాహనాలకు పెంచిన చార్జీలు, పెరిగిన మిగతా 6వ పేజీలో

సింగిల్ పర్మిట్ విధానం అమలుచేయాలి



రెండు రాష్ట్రాల మధ్య సింగిల్ పర్మింట్ విధానాన్ని అమలు చేస్తే ఒక్కొక్క లారీ యజమానికి ఏడాదిలో రూ.55 వేల పన్ను భారం తగ్గుతుంది. ఇప్పటికే అద్దెలు లేక ఇబ్బందులు ఉంటే, పన్ను పోటుతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- గుమ్మడి దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్

వైటీపీఎస్ నిర్వాసితులకు ఉద్యోగాలు

సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) నిర్వాసితులకు ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దామరచర్ల మండలం వీర్లపాలెంలో వైటీపీసీ నిర్మాణం సమయంలో భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం పరిహారం అందించగా, నిర్వాసిత కుటుంబాలకు ఉపాధి అవకాశం కల్పించనున్నదన్నారు. థర్మల్‌పవర్‌ప్లాంట్ ఏర్పాటుతో 169 కుటుంబాలు ఇళ్లు కోల్పోగా, పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. అయితే ఇళ్లను కోల్పోయిన బాధిత కుటుంబం నుంచి ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తొలి విడత 133 కుటుంబాలను ఎంపిక చేశామని, ఆయా కుటుంబాల్లో విద్యార్హతను పరిగణించి ఒకరికి ఉద్యోగం కల్పిస్తామన్నారు. అయితే కుటుంబసభ్యులు ఏకాభిప్రాయంతో అంగీకారపత్రం, విద్యార్హత ధ్రువపత్రాలను సమర్పించాలన్నారు. ఈ నెల 22నుంచి 29 వరకు ధ్రువీకరణ పత్రాలను దామరచర్ల తహసీల్దార్‌కు అందజేయాలన్నారు. తొలివిడత నియామకాలు పూర్తయిన వెంటనే రెండోవిడతలో మిగిలిన మరో 36 కుటుంబాలకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో వైటీపీఎస్ ఈఈ జయరాంరెడ్డి, డీఏవో శ్రీనివాస్‌శర్మ, మిర్యాలగూడ, దామరచర్ల తహసీల్దార్లు హరిబాబు, జవహర్‌లాల్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారం దిశగా చర్యలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజాసమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 25 మంది నుంచి అర్జీలు తీసుకొని బాధితులతో మాట్లాడారు. వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధికం భార్య, భర్తల మధ్య పంచాయితీలు, భూవివాదాలకు చెందినవే ఉన్నాయి.

పథకాల అధ్యయనానికి నల్లగొండ వేదిక

కలెక్టర్ సి.నారాయణరెడ్డి



ఆల్‌ఇండియా సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారుల బృందంతో కలెక్టర్

నల్లగొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాల అధ్యయనానికి నల్లగొండ జిల్లా చక్కని వేదిక అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. జిల్లాలో అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అధ్యయనం నిమిత్తం జిల్లాకు వచ్చిన 21 మంది ఆలిండియా సర్వీసెస్, సెంట్రల్ సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారుల బృందం సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుంది. వారితో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో నల్లగొండ జిల్లా పెద్దదని, 33 మండలాలు, నాలుగు రెవెన్యూ రెవెన్యూ డివిజన్లతో ఏర్పాటైందని వివరించారు. జిల్లాలో వ్యవసాయం ప్రధాన జీవనాధారమని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ అమలుచేస్తున్నామన్నారు. వీటిని అధ్యయనం చేసేందుకు మారుమూల గ్రామీణ ప్రాంతాలతో పాటు, మునిసిపల్, పట్టణ ప్రాంతాలు జిల్లాలో ఉన్నందున ఇది ప్రొబేషనరీ బృందానికి చక్కగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, పరిశ్రమలశాఖ జేడీ కోటేశ్వర్‌రావు, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతం చేయాలి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. 'ప్రజావాణి'లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కాగా, మొత్తం 63 ఫిర్యాదులు వచ్చాయి.

కర్నాటిపల్లి పంచాయతీలో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

దేవరకొండ: దేవరకొండ మండలం కర్నాటిపల్లి గ్రామానికి సోమవారం ఐదుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు చేరుకున్నారు. ఈనెల 25వరకు వారు పంచాయతీలోనే ఉండి ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యలు తదితర విషయాలపై అధ్యయనం చేయనున్నారు. ఈ బృందానికి ఎంపీడీవో డానియెల్, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, పలు శాఖల అధికారులు స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు.

సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటు వద్దు



పెద్దకాపర్తిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రామస్థులు, విద్యార్థులు

చిట్యాలరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి జిల్లా రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటు చేయవద్దని పెద్దకాపర్తి గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో విద్యార్థులు, గ్రామస్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుతో సమీపంలో ఉన్న తమ గ్రామానికి కాలుష్యం వ్యాపించే అవకాశం ఉందని, దీంతో అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 23వ తేదీన నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు మర్రి జలంధర్‌రెడ్డి, చేకూరి గణేష్, ముద్దసాని రమణారెడ్డి, ఆవుల జానయ్య, నీలకంఠం లింగస్వామి, మాచర్ల యాదగిరి, సాగర్ల నాగరాజు, ఏర్పుల గణేష్, పున్న విష్ణు, నూతి తిరుమలేష్, ఏర్పుల రాకేష్, దామోదర్, పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి

నకిరేకల్, అక్టోబరు 21: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని డీఎస్‌వో వెంకటేశ్వర్లు అన్నారు. నకిరేకల్‌లోని చీమలగడ్డలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నకిరేకల్‌లో కొనుగోలు చేసిన నాలుగు లారీల ధాన్యాన్ని కట్టంగూరు మండలంలోని గోదాముకు పంపినట్లు తెలిపారు. మిల్లర్ల జాప్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నందున ధాన్యాన్ని కాంటా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం హరీష్, డీటీఎస్ అధికారి జ్యోతి, ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే 'ప్రజాపాలన'

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



'ప్రజాపాలన'లో అర్జీలు తీసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం 'ప్రజాపాలన' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సమస్యలను గ్రామ, మండల స్థాయిలోనే పరిష్కరిస్తే ప్రజలు డివిజన్, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం రాదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రైతు భరోసా విషయంలో అపోహలకు గురికావద్దని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నాయకులు సాగులో లేని వందల ఎకరాల భూములను దొంగ పట్టాలు చేసుకొని రైతుబంధును కొల్లగొట్టారని ఆరోపించారు. వాటిని నివారించి ప్రజా ధనాన్ని కాపాడేందుకే జిల్లాలోని తిరుమలగిరి(సాగర్) మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని సర్వే చేపట్టినట్లు తెలిపారు. సుమారు 1,200ఎకరాల భూమి సాగు లేకున్నా దొంగ పాస్‌పుస్తకాలతో రైతుబంధు సొమ్మును దోచుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ఈ పొరపాట్లు ఉండకూడదనే కమిటీని వేసి విధివిధానాలకు అనుగుణంగా సాగులో ఉన్న ప్రతీ రైతుకు రైతుభరోసా అందించనున్నట్లు తెలిపారు. దీనిపై ప్రతిపక్షాల మాయమాటలకు మోసపోయి ఆందోళనకు గురికావద్దన్నారు. గ్రామాల నుంచి ధాన్యం తరలించడంలో ఇబ్బందులు కలగకుండా రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అనంతరం ప్రజావాణిలో భాగంగా స్వీకరించిన అర్జీలను ఎంతవరకు పరిష్కరించారో సమీక్షించారు.

- సల్కునూరు పీఏసీఎస్ కేంద్రంలో నాబార్డు నిధులు రూ.24.33 లక్షలతో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామును ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించారు. మిల్లర్లు లేనిపోని సాకులతో ధాన్యం ధర తగ్గించవద్దన్నారు. మిల్లు పాయింట్ల వద్ద అధికారులు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శారదాదేవి, తహసీల్దార్ సాదత్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు రావు ఎల్లారెడ్డి, చిరుమర్రి కృష్ణయ్య, తమ్మడబోయిన అర్జున్, మాలి కాంతారెడ్డి, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, పుట్టల కృపయ్య, పెదవెంకన్న, పుట్టల శ్రీనివాస్, పాల్గొన్నారు.

20 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులు 20 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,29,692 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 2,22,147 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది. అదేవిధంగా అడవిదేవులపల్లి మండలంలోని టెయిల్‌పాండ్ 13 క్రస్ట్ గేట్లు ఎత్తి 2,13,088 క్యూసెక్కుల నీటిని పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి, నాగార్జునసాగర్, అడవిదేవులపల్లి

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

● దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్


చింతపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, నేరేడుగొమ్ము, చింతపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం నియోకవర్గంలోని దేవరకొండ, నేరేడుగొమ్ము, చింతపల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు, రైతులకు వివరించాలని అన్నారు. రైతులు పండించిన వరిధాన్యం కొనుగోలులో గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలోనే మద్దతు ధర లభిస్తుందని అన్నారు. రైతులు ధాన్యం కల్లాల వద్దనే ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అన్నారు. రైతుల శ్రేయస్సు కోసం రూ.2లక్షల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. వచ్చే యాసంగి సీజన్ నుంచి రైతుభరోసా పథకం ద్వా రా రూ.7500 రైతులకు అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

● దేవరకొండ నూతన పాలకమండలి మార్కెట్ కమిటీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, మార్కెట్ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఏడీఏ శ్రీలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

● నేరేడుగొమ్ము మండలం పేర్వాల గ్రామ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బాలునాయక్ ప్రారంభించారు. ధాన్యం కొనుగోలులో మోసాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ కాంగ్రెస్ నాయకుడు సిరాజ్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్లు కొండ్రం శ్రీశైలంయాదవ్, జాల నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ, పాపనాయక్, వెంకటయ్య, రమేష్, బిక్కునాయక్, తహసీల్దార్ శ్రీరాములు పాల్గొన్నారు.

● చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతుల శ్రేయస్సు కోసం రూ.2 లక్షల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. వచ్చే వేసవికాలం సీజన్ నుంచి రైతు భరోసా పథకం ద్వారా రూ.7500 రైతులకు అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొం తం అలివేలు సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, హరినాయక్, కాయితి జితేందర్‌రెడ్డి, జిల్లా అధికారప్రతినిధి ముచ్చర్ల యా దగిరి, నాయకులు వెంకటయ్యగౌడ్, శ్రీనివాస్, వెంకటయ్య, ఏడీ శ్రీలక్ష్మి, ఏవో శ్రావణకుమారి, సీఈవో మల్లేష్ తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, ఎంపీడీవో సుజాత, ఏఈవో నరసింహ, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

చింతపల్లి: అర్హులందరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు, పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎండీ.సిరాజ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాల్ మర్కెట్ కమిటీ చైర్పర్సన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ కొండూరి భవానిపవన్ కుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యులు హరినాయక్, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, నరసింహారెడ్డి, తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరవలేనివి

● ఎమ్మెల్యే బాలునాయక్


దేవరకొండలో కొవ్వత్తులతో నివాళులు అర్పిస్తున్న స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు

దేవరకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేశం కోసం, ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ అన్నారు. సోమవారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సమాజంలో శాంతిభద్రతలు కాపాడటమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. దేశ సరిహద్దులలో సైనికులు దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పిస్తున్నారని గుర్తు చేశారు. పోలీస్ అమరవీరులకు కొవ్వత్తులతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ ఉమామహేశ్వర్, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీధర్‌గౌడ్, కృష్ణకిషోర్, భాస్కర్‌రెడ్డి, రాజు, కృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

● పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరకొండలో సోమవారం రాత్రి పోలీసులు, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అమరుల త్యాగాల వల్లే నేడు అందరం ప్రశాంతంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సీఐ నరసింహులు, ఎస్ఐ రమేష్, దానియాల్, వెంకటయ్య, సభ్యులు ఎన్‌వీటీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన ఉండాలి

చింతపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో సుజాత అన్నారు. సోమవారం ఆల్ ఇండియా సెంట్రల్ పోలీసులు (సర్వీస్) చింతపల్లి మండలంలోని జర్పులతండాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

సంతకం ఫోర్జరీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏఐకేఎఫ్ నాయకులు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గతంలో మిర్యాలగూడ ఆర్డీవోగా పని చేసిన అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి భూ నిర్వాసితుల పేరిట నిధులు కాజేసిన వ్యక్తులపై శాఖాపరంగా కఠినచర్యలు తీసుకోవాలని అఖిలభారత రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్వాసితులకు మంజూరైన నిధులకు సంబంధించిన చెక్‌బుక్‌ను కాజేసి ఆర్డీవో సంతకాన్ని ఫోర్జరీ చేసి లింగస్వామి, బొడ్డుపల్లి కోటయ్య పేరిట లక్షలాది రూపాయలు డ్రా చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిపై నేటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. చెక్‌బుక్ మాయం వెనుక ఎవరి హస్తం ఉందన్న విషయాన్ని సైతం అధికారులు నేటి స్పష్టం చేయలేదన్నారు. నిధులు కాజేసిన వారినుంచి సొమ్ము రికవరీ వివరాలను అధికారులు బహిరంగంగా ప్రకటించాలని మట్టయ్య డిమాండ్ చేశారు. ఆయన వెంట ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెద్దారపు రమేష్ ఉన్నారు.

సాంకేతిక మెళకువలు నేర్చుకోవాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక మెళకువలు నేర్చుకోవాలని మీనా మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎండీ. మహిమూద్‌అలీ అన్నారు. కళాశాలలో టాస్క్ పేరుతో స్టూడెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎస్సీ, ఏఐఎంఎల్, ఈఈఈ, ఈసీఈ కోర్సుల విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ షెఫ్లా, కోచ్ రమేష్, మగ్దూం, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా సోములు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మండలి సోములు నియమితులయ్యారు. పార్టీలోని పలు విభాగాల్లో సేవలందించిన సోములును ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి సోములుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సోములు మాట్లాడుతూ ఓబీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాధినేని శ్రీనివాసరావు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ బంటు సైదులు తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎడ్ల రమేష్, బంటు గిరి, సైదులు, నంద రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక సభ్యత్వ నమోదుకు కార్యకర్తలు కృషి చేయాలి : బీజేపీ



దేవరకొండలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న లాలునాయక్

డిండి, చింతపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వాలు అధిక సంఖ్యలో నమోదు చేయాలని నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ అన్నారు. సోమవారం డిండి మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ఆయన మాట్లాడారు. బీజేపీలో సభ్యత్వం పొంది బీజేపీలో సభ్యులుగా చేరి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. బీజేపీతోనే దేశం సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోయేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏటి కృష్ణ, వానం నరేందర్‌రెడ్డి, రాధిక, రాఘవ, బిక్షపతి, అమృత, అంజి, శ్రీను, సురేష్, ద్రోణాచారి, సాయి, సంతోష్, శివ, బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి వెన్నం శేఖర్, కుంభం శ్రీనివాస్ రెడ్డి, కనిగిరి గోవర్ధన్, కుందేళ్ల శ్రీశైలం, గజ్జ అభినవ్, మోర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జీవో 29ను రద్దు చేయాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేసే జీవో 29ను వెంటనే రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్ వర్గాలకు ఓపెన్ కేటగిరిలో ఉద్యోగాలు రాకుండా జీవో 29 అడ్డుకుంటోందన్నారు. ఈ జీవోతో మెరిట్ గల బీసీ అభ్యర్థులు సైతం రిజర్వేషన్ కేటగిరిలోకి నెట్టివేయబడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లతో ఇప్పటికే నష్టపోతున్న బీసీలకు జీవో 29 మరింత నష్టం చేకూరుస్తుందన్నారు. మొన్న జరిగిన డీఎస్సీ నియామకాల్లో ఇదే తంతు జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బంటు వీటీ, అంజి, రాంబాబు పాల్గొన్నారు.